ప్రొ.జయశంకర్ సేవలు మరువలేనివి


జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని శేరిలింగంపల్లిలోని జయశంకర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వెన్నంటి ఉండి, రాష్ట్ర సాధనలో భాగస్వాములయ్యారన్నారు. జయశంకర్ సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..

రాయదుర్గం: జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. తెలంగాణ భావజాలవ్యాప్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు జయశంకర్ అని కొనియాడారు.

● వినాయకనగర్‌లో..

బాలానగర్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ.జయశంకర్ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి యువతకు పిలుపు నిచ్చారు. బాలానగర్ వినాయకనగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

● విశ్వకర్మ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

చందానగర్: తెలంగాణ సమాజానికి ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు ఎనలేనివని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. జయశంకర్ వర్ధంతిని విశ్వకర్మ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగారంలో ఘనంగా నిర్వహించారు.

ఏఐ వినియోగంతో అన్ని రంగాల్లో అభివృద్ధి

ఐఐఐటీహెచ్ సదస్సులో వక్తలు

హైదరాబాద్ సిటీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వినియోగంతో అన్ని రంగాల్లో భారీ మార్పులతో పాటు అభివృద్ధి కూడా ఉంటుందని క్వాల్‌కాం ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ కురుండ్‌కర్ అన్నారు. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీహెచ్) రీసెర్చ్ సెమినార్‌లో భాగంగా శుక్రవారం 'ఏఐ ఆన్ ది ఎడ్జ్'పేరుతో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిజజీవితంలో ఏఐ అప్లికేషన్‌లు, నెట్‌వర్కింగ్, బిజినెస్ ఇన్నోవేషన్స్, ఆవిష్కరణలను పంచుకోవడం తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఏఐని అభివృద్ధి చేసేందుకు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు ఒకతాటిపైకి రావాల్సిన అవసరాన్ని గురించి వక్తలు వివరించారు. కార్యక్రమంలో క్వాల్‌కాం ఇంజనీరింగ్ వీపీ రాజేష్ నారాయణన్, ఐఐఐటీహెచ్ ప్రొఫెసర్ అనూప్ నంబూద్రి పాల్గొన్నారు.

ఆఫీసు వేళల్లో మార్పు.. కార్ పూలింగ్‌కు ప్రాధాన్యం

హైదరాబాద్ సిటీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కార్యాలయాల వేళల్లో మార్పులు చేయడం, ప్రజా రవాణాతో పాటు కార్ పూలింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా ఐటీ కారిడార్‌లో వాహనాల రద్దీని తగ్గించవచ్చని జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ అన్నారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు చెక్‌పెట్టేందుకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీ సంస్థల ప్రతినిధులతో ఫినిక్స్ ఎరినా, సత్త్వా నాలెడ్జ్ సిటీ ప్రాంతాల్లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ సంస్థల్లో ఉద్యోగులందరూ ఒకే సమయంలో రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయా సంస్థల పని వేళల్లో స్వల్ప మార్పులు చేయాలని సూచించారు. అంతేకాకుండా రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో పాటు ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమించడం ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించవచ్చన్నారు. ఒకే ప్రాంతం నుంచి కార్యాలయాలకు వచ్చే వారు కార్ పూలింగ్ చేయడం ద్వారా రోడ్డుపై వాహనాల సంఖ్యను తగ్గించొచ్చని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సీ ఎస్సీ జనరల్ సెక్రటరీ రమేష్ కాజ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


బాచుపల్లి వీఆర్ఎస్ విజ్ఞాన్‌జ్యోతి విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి


ఫతేనగర్ : పార్కులో యోగా చేస్తున్న వివిధ అసోసియేషన్ల సభ్యులు


కేపీహెచ్‌బీకాలనీ ఆరోఫేజ్ అబ్దుల్ కలాం పార్కులో యోగా చేస్తున్న పోలీస్ ఆఫీసర్ గంగారాం, స్థానికులు

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

ఎంపీ ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నేటితరం యువత జీవిత లక్ష్యాలను చేరుకోవాలంటే యోగాను దినచర్యలో భాగంగా మార్చుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ సంస్థ, పతంజలి యోగా సమితి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ యోగా డే సందర్భంగా కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. యోగా ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తించి, ఆచరించడం భారతదేశానికే గర్వకారణమన్నారు. యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. అనంతరం యువతీ, యువకులతో కలిసి యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో మాధవరం కాంతారావు, మల్లారెడ్డి, యంజాల పద్మయ్య, శంకర్‌రెడ్డి, వడ్డేపల్లి రాజు, యోగా మాస్టర్ శివుడు పాల్గొన్నారు.


కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన యోగా వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నేత కాంతారావు

● హోలిస్టిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీకాలనీలోని భువన విజయం మైదానంలో ఆసుపత్రి నిర్వాహకులు డా.రామచంద్ర, వైద్యులు యోగాసనాలు చేశారు.


కేపీహెచ్‌బీకాలనీలో హోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

● కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి సీఈవో డా.యోబు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేశారు.


కొంపల్లి అశోక్‌విల్లాలో యోగా చేస్తున్న బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, కాలనీవాసులు


జీడిమెట్ల: అపురూపాకాలనీలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు


స్టార్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ గూడపాటి నానక్‌రాంగూడలోని ఆస్పత్రిలో సిబ్బందితో కలిసి యోగా చేశారు.


హైటెక్‌సిటీలోని మెడికవర్ ఉమన్ చైల్డ్ ఆస్పత్రిలో శుక్రవారం యోగా కార్యక్రమంలో పీడియాట్రీషియన్ డాక్టర్ జనార్దన్‌రెడ్డి, ఉమన్ చైల్డ్ సెంటర్ హెడ్ కృష్ణప్రసాద్, డాక్టర్ నిర్మలరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి హైటెక్స్‌లో ఐఐఐటీ డిజైన్ షోకేస్

హైదరాబాద్ సిటీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు ఇన్‌సైడర్ ఎక్స్-24 పేరుతో ఇంటీరియర్ డిజైనర్ షోను నిర్వహిస్తున్నట్లు ఐఐఐటీ హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ పల్లవి అంచూరి తెలిపారు. హైటెక్స్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైటెక్స్ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సును ఈనెల 28న ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐఐఐడీ కన్వీనర్ రాకేష్ వాసు, కో కన్వీనర్ నవీన్ చలసాని, వైస్ చైర్మన్ సందీప్‌జైన్ సెక్రటరీ అమితారాజ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో డిజిటల్ ప్రచార వాహనం

● ప్రజారక్షణ, నేర నియంత్రణే లక్ష్యం

● హెచ్ఎస్‌సీఎస్సీ ఆధర్యంలో ప్రారంభించిన సీపీ కొత్తకోట


ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న సీపీ

హైదరాబాద్ సిటీ, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజారక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ, నేరనియంత్రణే లక్ష్యంగా ప్రజలను అప్రమత్తం చేయడానికి హైదరాబాద్ సిటీ పోలీసులు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సీఎస్ఆర్)లో భాగంగా హెచ్‌సీఎస్సీ హైదరాబాద్ సిటీ పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ ప్రచార వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆడియో, డిజిటల్ వీడియోలతో ప్రజలను అప్రమత్తం చేసేవిధంగా ఈ వాహనం ద్వారా సిటీ కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రచారం చేయనున్నారు. ఈ వాహనాన్ని బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హెచ్‌సీఎస్సీ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్, మహిళా భద్రత, నేర నియంత్రణ, డ్రగ్స్ మహమ్మారి, సైబర్ సెక్యూరిటీ, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అంశాలపై డిజిటల్ ప్రచారం కల్పిస్తారు. అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, హెచ్‌సీఎస్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కొండాపూర్ శ్రీచైతన్య కళాశాలను సీజ్ చేయాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యత లేని ఆహార పదార్థాలను విద్యార్థులకు అందిస్తూ వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కొండాపూర్ శ్రీచైతన్య కళాశాలను సీజ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. కళాశాలలోని (వాల్మీకి క్యాంపస్) హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన సంఘటనపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ గురువారం హాస్టల్‌లో మధ్యాహ్నం పప్పు, గుడ్లు తిన్న తర్వాత 30 మందికి పైగా విద్యార్థులకు వాంతులు, విరేచనాలయ్యాయని చెప్పారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేశామని వారు పడ్డారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్‌అలీఖాన్, కళ్యాణ్, అనిల్‌కుమార్, మురళి, విజయ్ పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, చీఫ్ ఇంజనీర్

ఔరా అనిపించేలా.. మంజీరా సాంబార్!

● విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు

● వసతుల కల్పనలో తేడావస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మంజీరా బాలుర హాస్టల్‌లో సాంబార్.. ఔరా అనిపించేలా ఉందంటూ.. జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం హాస్టల్‌ను సందర్శించిన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు హాస్టల్ పరిసరాలను, వంటపాత్రల శుభ్రత, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఆపై విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రోజువారీ ఆహారంలో రుచి, నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత విషయంలో ఎలాంటి ఇబ్బంది కలిగినా హాస్టల్ వార్డెన్‌కు తెలపాలని, సమస్య పరిష్కారం కాకుంటే ప్రిన్సిపాల్ దృష్టికి తేవాలని సూచించారు. బయటి వ్యక్తులను హాస్టల్‌లోకి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని వార్డెన్లను ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టల్ సందర్శన కార్యక్రమంలో రిజిస్ట్రార్‌తో పాటు ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి, చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రజాసంబంధాల అధికారి పి.ప్రసన్న ఉన్నారు.

రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై కేసులు నమోదు


వాహనాలను సీజ్ చేస్తున్న పోలీసులు

రాయదుర్గం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ప్రత్యేకడ్రైవ్ నిర్వహించి రాంగ్‌రూట్‌లో వచ్చి న వారి 32 వాహనాలు సీజ్ చేసి నాలుగు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. డీఎల్ఎఫ్, ఎస్ఎంమాల్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో రాంగ్‌రూట్ వచ్చిన 32 వాహనాలను సీజ్ చేసి నాలుగు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పుప్పాలగూడలో డాక్టర్ గౌడ డెంటల్ ఆస్పత్రి

హైదరాబాద్ సిటీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): యాభై అయిదేళ్లుగా వైద్య చికిత్సలు అందిస్తున్న డాక్టర్ గౌడ డెంటల్ ఆస్పత్రి తన సేవలను విస్తరిస్తోంది. పుప్పాలగూడలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఆస్పత్రిని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ శనివారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ గౌడ్స్ డెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు, సీఎండీ డాక్టర్ ఎంఎస్ గౌడ్, సీఈఓ డాక్టర్ స్నిగ్ధాగౌడ్, డైరెక్టర్ డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. 1967 నుంచి దంత వైద్య సేవలు అందిస్తున్నామని, విస్తరణలో భాగంగా పుప్పాలగూడలో తమది ఆరవ ఆస్పత్రిగా చెప్పారు. ఇప్పటికే కోఠి, సికింద్రాబాద్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలకు విస్తరించినట్లు తెలిపారు.

'నీట్'పై విచారణ చేయాలి


ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు

బాలానగర్, జూన్ 21(ఆంధ్రజ్యోతి): నీట్ అవకతవకలు, పరీక్ష లీకేజీపై సమగ్ర విచారణ జరిపించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) మేడ్చెల్ జిల్లా కమిటీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కార్తీక్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు బాలానగర్‌లో ప్లకార్డులతో నిరసన ప్రదర్శించారు. ఈ సదర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నిరంతరం విద్యారంగంలో విభేదాలు తీవ్రమౌతున్న నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

సైబరాబాద్‌లో 27మంది ఎస్ఐల బదిలీ

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 27 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ ఎస్ఐ జి.మనియామ్ కేపీహెచ్‌బీకి, కేపీహెచ్‌బీ ఎస్ఐ కె.సత్యనారాయణ మైలార్‌దేవుపల్లికి, అత్తాపూర్ ఎస్ఐ కె.నాగరాజు రాయదుర్గం ట్రాఫిక్‌కు, బాలానగర్ ఎస్ఐ అశోక్ లిగెపల్లి అత్తాపూర్‌కు, రాజేంద్రనగర్ ఎస్ఐ పి.రవికిరణ్ ఎస్ఓటీ బాలానగర్ జోన్‌కు, ఆర్‌జీఐఏ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న టి.వెంకటేశ్వరావును మాదాపూర్ ట్రాఫిక్‌కు, సీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఆర్.మౌనికను పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఎస్ఐ జి.శశిధర్‌ను ఐటీసెల్ సీపీఏ సైబరాబాద్‌కు, ఐటీ సెల్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న సయ్యద్ నజీర్ మియాన్‌ను కేపీహెచ్‌బీకి, ఐటీసెల్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఈ.రూపను కేపీహెచ్‌బీకి, గచ్చిబౌలి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.కృష్ణను మైలార్‌దేవ్‌పల్లికి, చెవెళ్ల నుంచి ఆర్. వీరబ్రహ్మమ్‌ను గచ్చిబౌలి ట్రాఫిక్‌కు, మైలార్‌దేవ్‌పల్లి ఎస్ఐ నయామ్ హుస్సేన్‌ను కేపీహెచ్‌బీ ట్రాఫిక్‌కు, సీసీఆర్‌బీకి చెందిన కె.రాజేశ్వర్ రెడ్డి మియాపూర్‌కు, మియాపూర్ ఎస్ఐ ఎం.రాజు సీసీఎస్ బాలానగర్ జోన్, పేట్‌బషీరాబాద్ ఎస్ఐ జి.సరిత కేపీహెచ్‌బి ట్రాఫిక్‌కు, సీసీఎస్ బాలానగర్ ఎస్ఐ దాసరి బాల్‌రాజ్ ఎస్ఓటీ మాదాపూర్ జోన్, ఎస్ఓటీ మాదాపూర్ జోన్ ఎస్ఐ బి.నర్సింహారెడ్డి మియాపూర్‌కు, ఎస్ఓటీ బాలానగర్ జోన్ ఎస్ఐ మామిడి కిషోర్ రాజేంద్రనగర్‌కు, రాయ్‌దుర్గం ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న మలావత్ పరుషురామ్‌ను శామీర్‌పేట్ పీఎస్‌కు బదిలీ చేశారు.